క్లుప్తంగా

మరుగుదొడ్డి శుభ్రం



మరుగుదొడ్డిని శుభ్రం చేయిస్తున్న గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డిని గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా గ్రీన్ అంబాసిడర్లతో శుభ్రం చేయించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'మరుగున పద్దాయ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ మరుగుదొడ్డిని శుభ్రం చేయించి, నీటి కోసం కొళాయి అమర్చి, తలుపు మరమ్మతు చేయించారు. దీంతో గ్రామస్తులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

త్రైమాసిక పరీక్షలకు సిద్ధం కావాలి



ప్రోగ్రెస్ కార్డు అందజేస్తున్న ప్రిన్సిపాల్

నాగలాపురం: త్రైమాసిక పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత హాజరయ్యారు. యూనిట్ టెస్టుల్లో విదార్థులు సాధించిన ప్రగతిని గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు త్రైమాసిక పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. ఆ తరువాత విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మధుసూదన్, వేలాయుధం పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



చెకుముకి టెస్టు నిర్వహిస్తున్న జేవీవీ ప్రతినిధులు

శ్రీకాళహస్తి రూరల్: చెకుముకి సైన్స్ టెస్టులో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మండలంలోని గుండేలిగుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక కార్యదర్శి బి చెంచయ్య, ఉపాధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్స్ టెస్టు నిర్వహించారు. ఈ పరీక్షలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ముని తిరుమలయ్య చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ పరీక్ష విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు మస్తానయ్య, ఢిల్లీబాబు, భాస్కరయ్య, రమాదేవి, శ్రీకర్, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

సత్యవేడు: ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ మురళి తెలిపారు. బుధవారం పెద్ద ఈటిపాకం పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు రైతులకు వెదజల్లు పద్ధతి, కలుపు యాజమాన్యం, వరిలో నూతన వంగడాలు, వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రూబెన్, ప్రవీణ్‌కుమార్, వికేన్‌బాషా ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన శివకుమార్(34), సుబ్రమణ్యం (29) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళతుండగా సీతారాంపేట సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

సత్యవేడు: మండలంలోని సత్యవేడు- శ్రీకాళహస్తి రోడ్డులో సాయిబాబా గుడి సమీపంలో సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని లారీ ఢీ కొనడంతో గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కామనాయుడుపేటకు చెందిన జయకుమార్ (56) తమిళనాడులోని బొమ్మాజిగుంట వద్ద ఉన్న పేపర్ అట్టల ఫ్యాక్టరీలో నైట్ డ్యూటీ చేసి బుధవారం ఉదయం ఇంటికి బయలుదేరాడు. మార్గం మధ్యలోని సత్యవేడు సమీపంలో అతడిని లారీ ఢీకొంది. దీంతో గాయపడిన జయకుమార్‌ను సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి, చెన్నై జీహెచ్‌సీ వైద్యశాలకు సిఫార్సు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామస్వామి తెలిపారు.

అందని బోధనం

పాఠం.. అనాసక్తికరం



ఉపాధ్యాయులకు బోధనలో పాఠ్యప్రణాళిక ఎంత అవసరమో.. బోధనాభ్యసన పరికరాలు(టీఎల్ఎం) అంతే అవసరం. మౌఖికంగా పాఠం చెప్పడానికి టీఎల్ఎంతో బోధించడానికి ఎంతో వ్యత్యాసం ఉంది. సాధారణంగా విద్యార్థులు విన్నదానికంటే..చూసిన విషయాన్నే ఎక్కువ కాలం గుర్తుంచుకుంటారనేది వాస్తవం. అందుకు సామగ్రి అవసరమవుతోంది. అయితే పాఠశాల నిర్వహణ నిధులు లేక పాఠం నీరసించి పోతోంది.



వరదయ్యపాళెం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

- విడుదల కాని స్కూలు గ్రాంటు
- చాక్‌పీస్, డస్టర్, రిపేర్లకు అవస్థ
- హెచ్ఎంలపై భారం

వరదయ్యపాళెం: ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం ఏటా పాఠశాల నిర్వహణ గ్రాంటు విడుదల చేస్తుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తవుతున్నా పాఠశాలలకు నిర్వహణ గ్రాంటు విడుదల చేయలేదు. దీంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే చాక్‌పీస్‌లు, డస్టర్, మైనర్ రిపేర్లకు తమ జేబుల్లో నుంచి డబ్బులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుందో? లేదోనని హెచ్ఎంలు అయోమయస్థితిలో ఉన్నారు.

గ్రాంటు కోసం ఎదురుచూపులు

పాఠశాలల నిర్వహణ గ్రాంటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో ఆయా పాఠశాలల హెచ్ఎంలు దాని కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో అమ్మఒడి పథకం నుంచి కొంత మినహాయించి నిధులను అందజేసేవారు. ప్రస్తుతం తల్లికి వందనం ఈ ఏడాది ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. ఒకవేళ ఇవ్వకపోతే ఇక నిర్వహణ గ్రాంటు పరిస్థితి ఏమిటోనని పలువురు పేర్కొంటున్నారు. నిధులు మంజూరు కాకపోతే పాఠశాలల నిర్వహణ కష్టతరమవుతుందని వాపోతున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో 394 పాఠశాలలు

సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 394 ఉన్నాయి. సంబంధిత పాఠశాలల్లో 25 వేల మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్ల అవసరాల నిమిత్తం ప్రతి ఏటా నిర్వహణ నిధులను మంజూరు చేస్తుంది. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదలవుతాయి. ఆ నిధులను తరగతి గదుల్లో అవసరమైన చాక్‌పీస్, డస్టర్లు, ఇతర చిన్న చిన్న మరమ్మతుల కోసం వినియోగిస్తారు. అయితే కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ నిధుల మాట విస్మరించింది. దీంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఆయా ఖర్చుల నిమిత్తం చేతి నుంచి భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా మంది హెచ్ఎంలు చేతి నుంచి ఖర్చు పెట్టి ప్రభుత్వం నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందోనని ఎదురుచూస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు

పాఠశాలలో 20 మందిలోపు విద్యార్థులుంటే రూ. 10 వేలు, 21 నుంచి 49 మంది లోపు విద్యార్థులుంటే రూ. 15 వేలు, 50 నుంచి వంద మంది లోపు విద్యార్థులుంటే రూ. 20 వేలు, 101 నుంచి 250 మంది లోపు ఉంటే రూ. 50 వేలు, 251 నుంచి వెయ్యి మంది లోపు విద్యార్థులు ఉంటే రూ.75 వేలు, వెయ్యిపైన విద్యార్థులు చదువుతుంటే రూ.లక్ష వరకు నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలల నిర్వహణ గ్రాంటుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో నిధులను మంజూరు చేసేవారు. పాఠశాలల్లో అవసరమైన ప్రతి వస్తువు కొనుగోలు చేసేందుకు నిధులను కేటాయించేవారు. పాఠశాలల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకునేవారు.

మా చేతి నుంచి పెడుతున్నాం



పాఠశాలల నిర్వహణ గ్రాంటు ఇప్పటివరకు విడుదల కాలేదు. చాక్‌పీస్‌లు, డస్టర్లు, మైనర్ రిపేర్లు తదితర ఖర్చులు మా చేతి నుంచి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయం అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. త్వరలో నిధులు విడుదలవుతాయని చెబుతున్నారు. నిధులు విడుదలైతే పాఠశాలలకు అవసరమైన వాటిని కొనుగోలు చేయడంతోపాటు మైనర్ రిపేర్లు చేయించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతాయి.

-రమణయ్య, హెచ్ఎం, జెడ్పీ ఉన్నత పాఠశాల, వరదయ్యపాళెం

30న మహాజన సభ

నారాయణవనం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను ఈనెల 30వ తేదీ నిర్వహించనున్నట్లు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి నిరంజన్ బాబు, సీఈఓ బాలసుబ్రమణ్యంలు తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు కార్యాలయ ఆవరణలో జరిగే సమావేశంలో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు జరిగిన లావాదేవీలు, జమా ఖర్చులు, 2023-2024 ఆర్థిక సంవత్సరం ఆడిట్ నివేదికను పరిశీలించి, ఆమోదం కోరుతామన్నారు. సంఘం కంప్యూటీకరణలో భాగంగా సంఘ సభ్యులు తమ ఈకేవైసీ కోసం ఆధార్, భూమి పాసు పుస్తకాలు ఇప్పటివరకు సమర్పించని సభ్యులను, సంఘంలో సభ్యులుగా ఉండి చనిపోయిన వారిని, సంఘ పరిధిలో నివాసం లేకుండా మరో గ్రామానికి వెళ్లిన సభ్యులను, సంఘ పరిధిలో ఉండి రెండేళ్లుగా సంఘంలో ఎలాంటి లావాదేవీలు జరపని సభ్యులను, భూమి లేని సభ్యులను గుర్తించి, వారి సభ్యత్వం రద్దు చేస్తామన్నారు.

రోడ్లపై పశు సంచారం.. వాహన చోదకులకు గ్రహచారం



రోడ్డుకు అడ్డంగా ఉన్న పశువులు

నాగలాపురం: పట్టణంలో పశువులు రోడ్లపై ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ సాయంత్రం వేళలో పశువులు మంద రోడ్లపై తిరుగడంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఎటు నుంచి ఏ పశువు దూసుకువస్తుందో తెలియక వాహన చోదకులు బిక్కుబిక్కుమంటూ వాహనాలను నడపాల్సిన పరిస్థితి నెలకొంది. పశువులు అడ్డంగా రావడంతో పలు రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. పశువులు యాజమానులకు ఇలా రోడ్లపై పశువులను వదలొద్దని చెప్పినా పట్టించుకోవడం లేదు. పంచాయతీ అధికారులు రోడ్లపై తిరుగుతున్న పశువుల యాజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక వికాసం



ఖోఖో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు



సీనియర్ బాలికల విభాగంలో విజేతగా నిలిచిన వరదయ్యపాళెం మండల ఖోఖో జట్టు

వరదయ్యపాళెం: క్రీడలతో మానసిక వికాసం సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం వరదయ్యపాళెం హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి ఖోఖో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అండర్-17 సీనియర్ బాలుర విభాగంలో విన్నర్‌గా సత్యవేడు మండలం జట్టు, రన్నర్‌గా వరదయ్యపాళెం మండలం జట్టు నిలిచింది. జూనియర్ బాలురు అండర్-14 విభాగంలో సత్యవేడు మండలం విన్నర్ కాగా, వరదయ్యపాళెం మండలం రన్నర్‌గా నిలిచింది. సీనియర్ బాలికల విభాగం అండర్-17లో వరదయ్యపాళెం మండలం విన్నర్ కాగా సత్యవేడు మండలం రన్నర్‌గా నిలిచింది. అండర్-14 జూనియర్ బాలికల విభాగంలో వరదయ్యపాళెం మండలం విజేతగా నిలవగా నారాయణవనం మండలం రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఉదయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం వైస్ ప్రెసిడెంట్ బందిల కుమార్, పీఈటీలు కిషోర్, భక్త గోపాల్, ముద్దుకృష్ణ, వినోద్ కుమార్, మనోహర్, సురేంద్ర, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో బోధించాలి



శిక్షణ ఇస్తున్న ప్రజా ప్రగతి ట్రస్టు నిర్వాహకులు

వరదయ్యపాళెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో బోధించాలని ప్రజా ప్రగతి ట్రస్టు కో-ఆర్డినేటర్లు సుబ్రమణ్యం, చెంచురామరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వరదయ్యపాళెంలో 50 మంది అంగన్‌వాడీ వర్కర్లకు ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శాస్త్రీయ పరిజ్ఞానం, అభినయ గేయాలు, ఆకారాలు, బ్రెయిన్ డెవలప్‌మెంట్ తదితర అంశాలకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ దేవకుమారి, సూపర్‌వైజర్ జ్యోతి, ట్రస్టు సభ్యులు గంగయ్య, ఓంకార్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వరదబాధితులకు విరాళం

సత్యవేడు: స్థానిక సన్‌రైజ్ హైస్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి రూ. 20 వేలు సేకరించి రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ చైర్మన్ సుబ్రమణ్యం రాజుకు పంపినట్లు స్కూల్ కరస్పాండెంట్ సతీష్ తెలిపారు.

ఘనంగా దీనదయాల్ జయంతి

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో బుధవారం పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమా సింగ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గంధోత్సవం విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నది వంతెన సమీపంలో ఉన్న హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా జుంలేషాపీర్ ఖాదరవలి ఉరుసు గంధోత్సవంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. శుక్రవారం సాయంత్రం 5గంటలకు గంధోత్సవం, అన్నదానం జరుగుతుందన్నారు. శనివారం సాయంత్రం గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కవ్వాలి కార్యక్రమం ఉంటుందన్నారు. కవ్వాలి పాట కచ్చేరి, 29న ముగింపు తహలీల్ పాతిహా జరుగుతుందని తెలిపారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని దర్గా ఉరుసు కమిటీ నిర్వాహకులు కోరారు.

ఎమ్మెల్యే సోదరుడి మృతి

నారాయణవనం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోదరుడు పాండురంగం(65) అనారోగ్యంతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న పాండురంగానికి బుధవారం మధ్యాహ్నం గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం మండలంలోని భీమునిచెరువులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు.

అందుబాటులోకి ప్రభుత్వ వైద్యసేవలు

రేణిగుంట: పేద ప్రజలకు అధునాతన వైద్యసేవలు అందించడానికి ప్రభుత్వ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. బుధవారం రేణిగుంట మండలంలోని అత్తూరులో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆరోగ్యాలను దష్టిలో పెట్టుకుని అత్తూరు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్యాకేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఆరోగ్య కేంద్రంలో అన్ని వైద్య పరికరాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

హాస్టల్ ఆకస్మిక తనిఖీ

ఏర్పేడు: మండలంలోని పల్లం ఎస్సీ హాస్టల్‌ను బుధవారం ఎంఈఓ-2 దయాకర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కిచెన్, గదులు, మరుగుదొడ్లు, హాస్టల్ ఆవరణలోని మునగ, బీర తోటను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని హాస్టల్ వార్డెన్ రవికి సూచించారు.

ఎన్బీపీపీఎల్ కంపెనీని సందర్శించిన కలెక్టర్



ఎన్బీపీపీఎల్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని మన్నవరంలో ఏర్పాటు చేసిన ఎన్బీపీపీఎల్ కంపెనీని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. మన్నవరం వద్ద సుమారు 750 ఎకరాల స్థలం ఎన్టీపీసీ, బీహెచ్ఈఎల్ పవర్ ప్రాజెక్ట్ లిమిటెడ్‌కు చెందిన పవర్ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమకు సుమారు 2008 సంవత్సరంలోనే భూమిని కేటాయించిన నేపథ్యంలో పరిశ్రమ వినియోగంలో ఉన్న స్థలాన్ని వినియోగంలో లేని స్థలాన్ని పరిశీలించి, కంపెనీ ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

మేలచ్చూరులో 'ఇది మంచి ప్రభుత్వం'

శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరులో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా పోషన్ మాసోత్సవాల్లో భాగంగా పోషన్ అభియాన్ కింద మహిళా శిశు సంక్షేమ శాఖ వారిచే ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి పోషకాహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు పసుపు కుంకుమ,చీరలు పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయ అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన ముగ్గును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీకాళహస్తి రవి శంకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, సీడీపీఓ శాంతి దుర్గ, ఎంపిడిఓ పటాన్ రఫీ ఖాన్, తహసీల్దార్ లక్ష్మీనరసింహ, పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



ఏర్పేడు చెరువులో మట్టి తవ్వుతున్న జేసీబీలు

ఏర్పేడు: మండలంలోని చెరువుల్లో రేయింబవళ్లు తేడా లేకుండా యథేచ్ఛ మట్టి అక్రమ రవాణా సాగుతోంది. స్థానిక టీడీపీ నాయకుల అండదండలతో జేసీబీ, హిటాచీలతో పరిమితులకు మించి మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ప్రైవేట్ వెంచర్లకు తరలించి రూ.లక్షలు గడిస్తున్నారు. చెరువుల్లో బావులను తలపించేలా గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో రానున్న వర్షాకాలంలో చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏర్పేడు చెరువులో అక్రమంగా మట్టి తరలింపుతో ఏర్పడిన గుంతలు బావులను తలపిస్తున్నాయి. ఆరులేన్ల రహదారి పనుల్లో భాగంగా రెండు రోజులుగా హిటాచీలతో పరిమితులకు మించి రేయింబవళ్ల తేడా లేకుండా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. చెరువులో 15 నుంచి 20 అడుగుల లోతు వరకు మట్టిని తోడేస్తున్నారు. ఇదే అదనుగా భావించిన పలువురు స్థానిక టీడీపీ నాయకులు, రియల్టర్ల నుంచి నగదును పొంది ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా వెంచర్‌లకు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. శివగిరిపల్లి చెరువు నుంచి విచ్చలవిడిగా ఐషర్ సమీపంలోని నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్‌కు మట్టిని తరలిస్తున్నారు. అలాగే మేర్లపాక, ముసలిపేడు, కందాడు తదితర చెరువుల్లో జోరుగా అక్రమ మట్టి తరలింపు జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి, అక్రమ మట్టి తవ్వకాలను ఆపాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ హరికృష్ణను వివరణ కోరగా చెరువుల్లో మట్టితరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: సీఎం చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన పెట్టుబడి సాయం హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ బుధవారం రైతులు నిరసన తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నలుగూరి రమణయ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు కావస్తున్న సీఎం చంద్రబాబు ఇప్పటివరకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను రైతులకు ఇవ్వలేదని తెలిపారు. రైతులు పంట సాగుకు పెట్టుబడి కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టు కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని వాపోయారు. 2023 ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ బోరు మోటార్లు మీటర్లు జీఓ 22ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చెరువులకు తెలుగుగంగ నీటి వదలాలని, రైతులు ధాన్యాన్ని అరబొట్టుకోవటానికి కల్లాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి గురవయ్య, తిరుపాలు, బాలగురవయ్య, రమణమ్మ, చెంగమ్మ, రైతులు పాల్గొన్నారు.

గౌరీగాయత్రికి జ్యోతిర్మణి అవార్డు



గౌరీగాయత్రిని సన్మానిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన విశ్రాంత ఎస్ఐ శివయ్య కుమార్తె గౌరీగాయత్రికి అస్ట్రాలజీకి చెందిన జ్యోతిర్మణి అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో విశ్వజ్యోతి విజ్ఞాన సమితి వారు ఈ అవార్డును ఆమెకు అందజేశారు. పలువురు గౌరి గాయత్రిని అభినందించారు.

సకాలంలో టీకాలతో వ్యాధులు దూరం



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

వరదయ్యపాళెం: పశువులకు సకాలంలో టీకాలు వేయించుకుంటే వ్యాధులు దూరం అవుతాయని పశువైద్యాధికారి నరేష్ కుమార్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని సాతంబేడు, సంతవేలూరు గ్రామాల్లో వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ అధికారులు సంయుక్తంగా పర్యటించి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏఓ ద్వారకనాథ్, ఏఈఓ ప్రవీణ్, వ్యవసాయ సహాయకులు పవన్, గీర్వాణి, ప్రసాద్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రకృతి వ్యవసాయంతో భూసారం దెబ్బతినకుండా అధిక దిగుబడితో రైతులకు మంచి లాభాలు వస్తాయని ఏఓ భారతి తెలిపారు. బుధవారం కాటూరు, విజయగోపాలపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రసాయనిక మందులను వాడాల్సిన అవసరం ఉందన్నారు.

ఉత్తమ టీచర్‌కు సన్మానం



మురళిని సన్మానిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గుమ్మడి మురళిని బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమలో కేశవులు, శంకర్, హరినాథ్‌నాయుడు, ఆశాకిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో మోస్తరు వర్షం



శ్రీకాళహస్తిలో కురుస్తున్న వర్షం

శ్రీకాళహస్తి: పట్టణంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వాతావరణం ఒకసారిగా మార్పు చోటుచేసుకుంది. దీంతో సుమారు గంటకు పైగా వర్షం కురిసింది. దీంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగింది.